యూపీ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జిగా నిర్మల్‌కుమార్ యాదవ్


నిర్మల్‌కుమార్ యాదవ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తున్న అజయ్‌సింగ్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాయింట్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్‌ను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ విభాగం ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనను నియమిస్తూ ఆల్ ఇండియ కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ క్యాప్టన్ అజయ్ సింగ్ యాదవ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్‌కు ఆయనకు ఇన్‌చార్జి బాధ్యత పత్రాన్ని అందజేశారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..తెలంగాణ తరహాలో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్‌ను పటిష్టం చేసి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి అప్పగించిన క్యాప్టన్ అజయ్ సింగ్ యాదవ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అగ్ర నాయకులు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

నవజాత శిశు సంరక్షణలో నర్సుల పాత్ర అమోఘం


కొత్తగా విధుల్లో చేరిన నర్సులతో సమావేశమైన డాక్టర్ ఉషారాణి

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణలో నర్సుల సేవలు అమోఘమైనదని, కొత్తగా ఎంపికై విధుల్లో చేరిన నర్సులు మాతా శిశువులతో స్నేహపూర్వకంగా మెలగాలని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా 192 మంది నర్సులు విధుల్లో చేరారు. ఈ మేరకు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి నర్సులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సులు విధుల పట్ల అనుసరించాల్సిన వైఖరిని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ జ్యోతి, నర్సింగ్ విభాగం అధికారిణి స్వరూప, విజయలక్ష్మి, మ్యాట్రన్స్ ఇందిరా, ఆశీర్వాదం, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మరోసారి ప్రధాని కావడానికి పాటుపడాలి


అయోధ్య స్పెషల్ ట్రైన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ కావడానికి ప్రతి కార్యకర్త పాటుపడాలని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ పేర్కొన్నారు. అయోధ్యకు శుక్రవారం మరో స్పెషల్ ట్రైన్‌ను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ..బీజేపీ తమ రామభక్తుల కోసం ఉచితంగా అయోధ్యకు ట్రైన్‌లను పంపిస్తున్నామన్నారు. హిందువుల 500 ఏళ్ల దీర్ఘకాల స్వప్నం నిజం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక కృషితోనే అయోధ్యలో రామ మందిర నిర్మాణం అయ్యిందన్నారు. తెలంగాణలో సైతం అత్యధిక ఎంపీ స్థానాలు బీజేపీ గెలుస్తుందన్నారు.

భట్టి విక్రమార్కకు సన్మానం


భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ గుండంలో స్నానం చేసిన భక్తులకు, మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తాను పలుమార్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఆలయాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్దిన గత ప్రభుత్వం భక్తులకు సౌకర్యాలు మాత్రం కల్పించలేదన్నారు. వెంటనే గుండంలో స్నానం చేసే భక్తులకు గదులు నిర్మించాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు.

‘క్రిడా’లో ముగిసిన జాతీయ సెమినార్


మాట్లాడుతున్న డాక్టర్ ఏ.కే.సింగ్


సెమినార్‌లో ఉత్తమ పోస్టర్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా)లో సుస్థిర వ్యవసాయం, పర్యావరణ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సెమినార్‌లో పాల్గొన్న ప్రముఖులు, నిపుణులు వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో అత్యాధునిక డిజిటల్ సాంకేతికలను సమగ్రపరచడం, కృత్రిమ మేధస్సు, బిగ్ డేటా అనలిటిక్స్, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్, సెన్సార్లు, కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌లతో సహాయ సహజ వనరుల నిర్వహణలో వ్యవసాయ డిజిటైజేషన్ అంశాలను సమర్పించి చర్చించారు. రైతులు, శాస్త్రవేత్తల పరస్పర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ముగింపు సందర్భంగా ఐసీఏఆర్-క్రీడా డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ సెమినార్ వివిధ కేటగిరీ ప్రదర్శనలు, ఆహ్వానిత ఉపన్యాసాలు, మౌఖిక, పోస్టర్ సెషన్‌లను సభకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీఏఆర్ (ఎన్‌ఆర్‌ఎం) డీడీజీ డాక్టర్ ఎస్.కె.చౌదరి మాట్లాడుతూ..రెండు రోజుల సెమినార్ సిఫార్సుల ఆధారంగా స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ఆయన ప్రతినిధులకు సూచించారు. అనంతరం అగ్రోఫిజిక్స్‌లో మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్.రావును ఘనంగా సత్కరించారు. అనంతరం గ్వాలియర్ ఆర్‌వీఎస్‌కేవీవీ మాజీ వైస్ చాన్సిలర్ డాక్టర్ ఎ.కె.సింగ్ మాట్లాడుతూ..సెమినార్‌లో చర్చించిన స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించేందుకు ప్రణాళికలను రూపొందించాలని ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ పోస్టర్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఏపీ ప్రగతి ఫర్మానిక్ మైతీ సెక్రటరీ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కాకపోయిన కూడా వేల సంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే కోటలోని నగీనాబాగ్, రాణిమహల్, ఆయుధాగారం తదితర ప్రాంతాలు పర్యాటకులతో నిండిపోయాయి. ఆయుధాగారంలోని కుతుబ్‌షాహి రాజుల నాటి కత్తులు, ఫిరంగులు, తదితర ఆయుధాలను చూసి పర్యాటకులు ఆశ్చర్యపోయారు. అక్కన్నమాదన్న కార్యాలయం దాని గోడలు, విశాలమైన ప్రాంగణం చూసి ఔరా ఆనాటి రాజసం అంటూ విస్తుపోయారు. వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోటతో పాటు కోట మెయిన్ గేట్ ముందు ఉన్న రెస్టారెంట్లు, గిఫ్ట్ షాపులు కిటకిటలాడాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



అబిడ్స్: వ్యాపార వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ వాణిజ్య సెల్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రెటరి కేడీ.ధినేష్ పేర్కొన్నారు. నగరంతో పాటు అన్ని ప్రాంతాల్లో వ్యాపార వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన కేడీ.ధినేష్ మాట్లాడుతూ..బేగంబజార్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో వ్యాపారుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి కేటాయించిన తెలంగాణ అధ్యక్షుడు బి.నర్సిములు, పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, సాయిబాబా, నాగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బోరింగ్‌లకు మరమ్మతులు చేయించండి

- నిరుపయోగంగా చేతి పంపులు
- పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థకు చేరుకున్న పవర్ బోర్లు


గాంధీనగర్‌లో పని చేయని చేతిపంపు

చార్మినార్: ప్రస్తుతం పాతబస్తీలో అక్కడక్కడ ఉన్న బోరింగ్‌లు (చేతిపంపులు) పని చేయడం లేదు. చాలా బస్తీల్లోని బోరింగ్‌లు నిరుపయోగంగా మారాయి. వాటిని బాగు చేయించడానికి సంబంధిత జలమండలి అధికారులు ముందుకురావడం లేదు. అలాగే గతంలో ఏర్పాటు చేసిన పవర్‌బోర్లు చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోలేక శిథిలావస్థకు చేరుకున్నాయి. పవర్‌బోర్‌కు మరమ్మతులు చేయించాలని వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిసిటీ అధికారుల చుట్టూ తిరిగినా..పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగితాల్లోనే మరమ్మతులు..

ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న బోరింగ్‌లు శిథిలావస్థకు చేరుకుని తుప్పుపట్టిపోతున్నాయి. తమ ప్రాంతాల్లోని బోరింగ్‌లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామని సంబంధిత జలమండలి మేనేజర్లు వారి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పాతబస్తీ ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం కాగితాలకే పరిమితమవుతున్న రిపేరింగ్‌లను ఉన్నతాధికారులు తమ చాంబర్లను వదిలి క్షేత్ర పరిశీలనకు వెళ్లకపోవడంతో ఏరియా మేనేజర్లదే ఇష్టారాజ్యంగా మారిందంటున్నారు. ఎక్కడ రిపేర్లు చేశారో..? చెప్పాలని ప్రశ్నించే వారు లేకపోవడంతో కిందిస్థాయి జలమండలి అధికారులకు ఎదురు లేకుండా పోయిందంటున్నారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పని చేయకుండా పోయిన బోరింగ్‌ల సమాచారాన్ని ఉన్నతాధికారులు తెప్పించుకుంటున్నారని..తాము కూడా నివేదికలు రూపొందించి అందజేస్తున్నామని పాతబస్తీ జలమండలి అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న నీటి అవసరాలు...

పెరుగుతున్న ఎండలతో నీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఎండ వేడిమికి అనుగుణంగా మంచినీటి సరఫరాలో కోత విధిస్తున్నారు. కుళాయిల్లో సరఫరా అయ్యే మంచినీరు సరిపోవడం లేదని పాతబస్తీ ప్రజలు అంటున్నారు. నిత్యవసరాల కోసం కుళాయిల ద్వారా వచ్చే మంచినీటితో పాటు బోరింగ్ నీరు కూడా ఎంతో అవసరం ఉంటుంది. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాతబస్తీలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండా కాలం రాకముందే..

ఎండా కాలంలో మంచి నీటి వాడకం ఎక్కువగా ఉంటుందని..దానికనుగుణంగా నీటి సరఫరాను కూడా పెంచాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు. ఎండాకాలం రాకముందే పాతబస్తీలోని కొన్ని బస్తీలకు మంచినీటి సరఫరా తగ్గుతోందని.. కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిలో కోత విధిస్తున్నారని..ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రాబోయే ఎండాకాలంలో నీటి సరఫరా పరిస్థితి ఏమిటంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీరు సరఫరా అవుతుండగా..అది కూడా అవసరమైన మేరకు సరఫరా కావడం లేదని పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నీటి వాడకానికి అనుగుణంగా నీటి సరఫరాలో ప్రెషర్ తగ్గిస్తున్నారని..దీంతో రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా వచ్చే మంచినీటి సరఫరాతో పాతబస్తీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు వాడుకోవడానికి అవసరమైన నీటిని బోరింగ్‌ల ద్వారా తెచ్చుకోవడానికి సిద్ధమవుతున్న స్థానికులకు చేతి పంపులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నేడు సైంటియా సైన్స్ ఎక్స్‌పో

గోల్కొండ: విద్యార్థుల మేధకు పదునుపెట్టేందుకు వారికి ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రవీంద్రభారతి పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియమనీష్ అన్నారు. శుక్రవారం మురాద్ నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. నేడు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సైంటియా సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం సైంటియా సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల మేధకు ఒక వేదిక లాంటిదని ఆమె అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సైన్స్ ఎక్స్‌పో ఉంటుందని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు అందరూ ఈ ప్రదర్శనకు ఆహ్వానితులే అని తెలిపారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: పదేళ్లగా ఉద్యోగులు తమ సమస్యలపై మాట్లాడడం మరిచిపోయారని ప్రశ్నిస్తే ఎక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుందని మౌనంగా ఉన్నారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ కళాశాలల్లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు ముందుకురావడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నిర్బంధం ఇప్పుడు లేదని, ప్రతి ఒక్కరికి మాట్లాడే స్వేచ్ఛ వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని ఉద్ఘాటించారు. అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కలిగే ఉపయోగాలను వివరిస్తూ తయారు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

గోల్కొండ: మద్యాన్ని అక్రమంగా అమ్మడం, రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ అష్వాక్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం గోల్కొండలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న విషయం తెలిసి స్పెషల్ పోలీసులు ఓ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో ఆ ఇంటి నుంచి వివిధ బ్రాండ్‌ల 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు మద్యం అక్రమంగా అమ్ముతున్న శోభ, సందీప్‌సింగ్‌ను అరెస్టు చేశామని ఆయన తెలిపారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

బద్దం బాల్‌రెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న దేవర వంశీ తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీని బలియమైన శక్తిగా తీర్చిదిద్దిన ఘనత కార్వాన్ మాజీ ఎమ్మెల్యే దివంగత బద్దం బాల్‌రెడ్డిదేనని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శుక్రవారం బద్దం బాల్‌రెడ్డి వర్ధంతిని గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశోక్‌యాదవ్, శ్రీకాంత్‌సాగర్, సుధాకర్, గంగాధర్, రమేష్ తదితరులున్నారు.

పాన్‌షాప్ నిర్వాహకుడికి రెండు రోజుల జైలు

నాంపల్లి: అర్ధరాత్రుల్లో పాన్‌షాప్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధించిన ఘటన మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన బురాన్(30) పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా మాసబ్‌ట్యాంక్ పోలీసు స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు పాన్‌షాప్ కొనసాగిస్తున్నాడు. దీంతో అతడిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం 12వ స్పెషల్ ఎంఎం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా కోర్టు మహ్మద్ బురాన్‌కు రెండు రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

లాస్య నందితకు నివాళి


పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న అంజదుల్లాఖాన్, బుంగ శివకుమార్

చార్మినార్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత పార్థివ దేహాన్ని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ సందర్శించి నివాళులర్పించారు. ఎంబీటీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్‌తో కలిసి ఆయన ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫిడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మహేశ్వర్ రాజ్ తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: బస్తీలోని కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజల సౌకర్యార్థం నూతన కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. కృష్ణారెడ్డినగర్‌లో నూతనంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బస్తీలోని కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకుందనే విషయాన్ని ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో నూతన కమ్యూనిటీ హాల్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కమ్యూనిటీ హాల్‌కు జీహెచ్‌ఎంసీ ద్వారా మంజూరైన రూ.18 లక్షలతో నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు సురేశ్, ప్రకాశ్, విజయ్‌కుమార్, సోని, సంగీత, స్వరూప, జ్యోతి, లక్ష్మీ, బీజేపీ నాయకులు జె.చిరంజీవి, ఎ.పండరీనాథ్, పొన్న శ్రీనివాస్ రావు, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్ పాల్గొన్నారు.

అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు

గౌలిపురా: అయోధ్యనగర్‌లోని జ్ఞాన భారతి మోడల్ ఉన్నత స్కూల్‌కు చెందిన విద్యార్థులు సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిసా హైస్కూల్‌లో జరిగిన థింకింగ్ డే స్కౌట్ అండ్ గైడ్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటారు. రంగోళిలో మొదటి బహుమతి, డ్రాయింగ్ పోటీల్లో మూడో బహుమతిని సాధించారు. స్కౌట్ అండ్ గైడ్ బృందానికి పాఠశాల ప్రిన్సిపాల్, విద్యావేత్త వి.ప్రభాకర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

గోల్కొండ: 24వ తేదీన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ షేక్‌పేట్ మండల అధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్ అన్నారు. షేక్‌పేట్‌తో పాటు గోల్కొండ మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. టోలిచౌకీ టూమ్స్ రోడ్‌లోని గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. విద్యా రంగంలో పేరుగాంచిన కౌన్సిలర్లు విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా షేక్‌పేట్ మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులను పంపదలచుకునే పాఠశాలల వారు 70329 07996లో సంప్రదించవచ్చు.

మెహిదీపట్నంలో ట్రా‘ఫికర్’


మెహిదీపట్నం కేఎఫ్‌సీ ముందు వాహనాలు

గోల్కొండ: మెహిదీపట్నంలో ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెహిదీపట్నం, కేఎఫ్‌సీ షోరూమ్, అజీజియా మసీదుతో పాటు పాత మెరాజ్ హోటల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. మెహిదీపట్నం పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే కింద గల యూటర్న్ వాహనాదారులకు అయోమయానికి గురి చేస్తుంది. ఈ యూటర్న్ నుంచి రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు సైతం ఈ యూటర్న్ గుండానే రోడ్డు దాటుతున్నారు. మెహిదీపట్నం బస్టాప్ వద్ద మాత్రమే ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు. ఇదిలా ఉండగా పాత మెరాజ్ చౌరస్తా వద్ద సైతం ట్రాఫిక్ నియంత్రణ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ ఉన్న సిగ్నల్స్ ఎప్పుడు పని చేస్తాయో ఎప్పుడు పని చేయవో తెలియని పరిస్థితి ఉంది. దీంతో వాహనాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వాహనాలు నడిపిస్తున్నారు. యూటర్న్‌ల వద్ద సిబ్బందిని నియమించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం


పూజ

అబిడ్స్: మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గంగాబౌలిలో నివసించే పి.పూజ ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి బాల్‌రాజ్ మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రైవేటు జాబ్ చేసే పూజ ఆచూకి కోసం పోలీసులు రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో గాలించారు. వైట్ కలర్ లెగిన్, గ్రీన్ కలర్ టాప్ ధరించిన పూజ ఆచూకి తెలిస్తే 87125 69180లో సమాచారం అందించాలని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఓబీసీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా వినయ్‌కుమార్



గన్‌ఫౌండ్రీ: అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా టి.వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఛత్రినాక ఏసీపీకి సన్మానం



చాంద్రాయణగుట్ట: ఛత్రినాక సబ్ డివిజన్ నూతన ఏసీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కానుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుంకరి వేణు, ప్రధాన కార్యదర్శి కె.మహేష్ కుమార్ తదితరులు పూల బొకే అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు



యాకుత్‌పురా: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని గురువారం టీ-పీసీసీ సీనియర్ నాయకుడు జినకరి నరేష్ కుమార్ తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ..పార్టీ కోసం పనిచేసే వారికి సమయానుకూలంగా గుర్తింపు లభిస్తుందన్నారు. మహ్మద్ భర్కత్‌అలీ, సూలేమాన్, కీర్తి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రవీంద్రనాయక్ నగర్‌లో న్యాయ సేవా సదస్సు

చార్మినార్: ఫలక్‌నుమా రవీంద్రనాయక్ నగర్ కాలనీలో ఈ నెల 24న ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహిస్తున్నామని.. స్థానికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అరోరా లీగల్ సైన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ డాలీ గౌతమి తెలిపారు. అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్థానిక బస్తీ ప్రజల సౌకర్యార్థం ఈ ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బేసిక్ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివ స్వాములు



గోల్కొండ: భాగ్యనగర్ శివ దీక్ష స్వాములు పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. శివ దీక్షలో ఉన్న గురు స్వాములు గుడిమల్కాపూర్ నుంచి శుక్రవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. బయలుదేరిన వారిలో ప్రభు పూజారి శివస్వామి, శివకుమార్ స్వామి, కొండన్న స్వామి, నాగరాజు స్వామి తదితరులున్నారు.

మక్కా మసీదులో ప్రశాంతంగా ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సామూహిక ప్రార్థనల్లో ముస్లింలతో పాటు చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ తదితరులు పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనలను పురస్కరించుకొని దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

కోట దర్వాజాలకు కొత్త సొబగులు

గోల్కొండ: గోల్కొండ కోటకు ఉన్న దర్వాజాలు సరికొత్త వెలుగులు విరజిమ్ముతున్నాయి. బంజారీ దర్వాజా, ఫతేదర్వాజా, మక్కై దర్వాజ, జమాలిదర్వాజా, మోతీ దర్వాజాలకు సరికొత్త లైట్లు వేశారు. సాయంత్రం కాగానే ఈ దర్వాజాలకు కొత్త రంగులతో జిగేలు మంటున్నాయి.

